మాజీ ఎమ్మెల్యే రాములునాయక్

ఇంటిపై సీబీఐ దాడులు

50మందికి పైగా వచ్చిన అధికారులు
ఖమ్మంలోని ఇంట్లో అర్ధరాత్రి సోదాలు

పాండురంగాపురంలో సీబీఐ సోదాలు నిర్వహించిన రాములునాయక్ ఇల్లు

ఖమ్మం, మే 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం జిల్లాలోని వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ ఇంట్లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) అధికారులు శుక్రవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఐటీ కమిషనర్‌గా ఉన్న రాములునాయక్ కుమారుడు జీవన్‌కుమార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఖమ్మం నగరం పాండురంగాపురంలోని తండ్రి ఇంట్లో సోదాలు జరిపారు. శుక్రవారం అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి వచ్చిన సుమారు 50మంది సీబీఐ అధికారులు ఆకస్మికంగా వచ్చి ఇంట్లో సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. అర్ధరాత్రి పలు వాహనాల్లో పోలీసులు ఆకస్మికంగా రావడంతో స్థానికులు కొంత భయాందోళనకు గురైనట్లు తెలిసింది. కాగా శుక్రవారం అర్ధరాత్రి వచ్చిన సీబీఐ అధికారులు శనివారం ఉదయం 9గంటల సమయంలో వెళ్లిపోయినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో రాములునాయక్ కుమారుడు జీవన్‌కుమార్‌ను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దాడుల విషయమై ఖానాపురం హవేలీ సీఐ భానుప్రకాశ్‌ను వివరణ కోరగా తమకు సమాచారం లేదని పేర్కొన్నారు.

హైదరాబాద్ వాళ్లు ఖమ్మం ఉపన్యాసాలు వినాలి

కవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న
నాగస్వరం కవితాసంపుటి ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

ఖమ్మం అర్బన్, మే 10 : హైదరాబాద్‌లో ఉపన్యాసాలు వినటానికి వస్తారు కానీ హైదరాబాద్ వాళ్లు వచ్చి ఖమ్మంలో ఉపన్యాసాలు వినాలి అనేది చాలాకాలంగా నాకున్న కల అని ప్రముఖ వాగ్గేయకారుడు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని న్యూఇరా పాఠశాలలో నిర్వహించిన నాగస్వరం కవితా సంపుటి ఆవిష్కరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖమ్మంలో కవులు గొప్పగా రాస్తున్నారని, చాలా అద్భుతంగా మాట్లాడుతున్నారన్నారు. నాగజాతి అనబడే దళిత మూలాలను ప్రస్తావిస్తూ కోయికోటేశ్వరరావు రాసిన నాగస్వరం గురించి ప్రసంగించారు. కవిగా కోయికోటేశ్వరరావు ఈ కవితా సంపుటిలో దళిత బహుజన వాదాన్ని బలంగా వినిపిస్తున్నారన్నారు. సమాజాన్ని చైతన్యపరిచేదే కవిత్వమని, తన కవిత్వం ద్వారా దళిత జీవనాన్ని సమాజానికి ఎరుకపరిచిన కోటేశ్వరావును అభినందించారు. ప్రస్తుత సమాజానికి ఇటువంటి కవిత్వమే కావాలని వక్తలు ఈ సందర్భంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో కవి విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య, న్యూఇరా విద్యాసంస్థల అధినేత ఇంజం వెంకటరమణారావు, ఫెమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు, హార్వెస్ట్ రవిమారుత్, నాయిం పాషా, కిన్నెర వెంకటేశ్వర్లు, కాకాభాస్కర్, కొప్పిశెట్టి సురేష్, కళాకారులు జాన్, పాగి వెంకన్న పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టును సత్వరమే పూర్తిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

బోనకల్లు, మే10: గోదావరి జలాలను పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేసి సీతారామప్రాజెక్టు సత్వరమే పూర్తిచేసి సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుసదస్సు నిర్వహించారు. సదస్సులో రాంబాబు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 6.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే దుమ్ముగూడెం సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయింపులు చేయడం లేదని ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వినోభానగర్ వద్ద నిర్మాణం ఆగిన ప్రధాన కాలువ పనులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 17 నెలల నుంచి జరగడం లేదన్నారు. ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు తరలింపు చేయాలంటూ పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేయడం తప్ప మరోమార్గం లేదన్నారు. ప్రభుత్వం సీతారామప్రాజెక్టు ప్రధాన కాలువ నుంచి రాజీవ్ లింక్ చేసి కేవలం ఖమ్మం జిల్లాలో మూడు, నాలుగు మండలాల్లో సాగునీరు అందించేందుకు ప్రయత్నం చేసి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలు వినియోగంలోకి తీసుకువచ్చామని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం తెలంగాణ రైతుసంఘం గ్రామకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పుల తిరుపతిరావు, కార్యదర్శిగా బొడ్డుపల్లి నాగచంద్రుడు, ఉపాధ్యక్షుడిగా దారగాని ఏడుకొండలు, కొమ్ము శంకర్‌రావు, ముంగి స్వామితో పాటు, మరో 10 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేశ్, కందికొండ శ్రీనివాసరావు, బంధం శ్రీనివాసరావు, కొప్పుల తిరుపతిరావు, బొడ్డుపల్లి నాగచంద్రుడు, వీరా స్వామి, దారగాని ఏడుకొండలు, కొమ్ము శంకర్‌రావు, దొప్పకొరివి వీరభద్రం, మాజీ సర్పంచ్ కొంగర వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, మే 10 : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర 30వ జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఎంపీ రవిచంద్ర తల్లిదండ్రులు వద్దిరాజు నారాయణ-వెంకటనర్సమ్మ జ్ఞాపకార్థం సుమన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే-డూ అకాడమీ ఇండియా ఈ పోటీలను నిర్వహిస్తున్నది. అకాడమీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ రవిచంద్ర సౌజన్యంతో ఈ పోటీలు జరుగుతాయి. ఖమ్మం వర్తక సంఘం భవనం ప్రాంగణంలో వచ్చేనెల జూన్ ఒకటవ తేదీన ఉదయం 9గంటలకు ఎంపీ వద్దిరాజు, అకాడమీ చైర్మన్ ప్రముఖ సినీహీరో సుమన్ తల్వార్ ముఖ్యఅతిథులుగా హాజరై ఈ పోటీలను ప్రారంభిస్తారని జల్లెల శ్రీనివాసరావు తెలిపారు.

ఎస్‌బీఐటీలో 16మందికి ఉద్యోగాలు

విద్యార్థులను అభినందిస్తున్న గుండాల కృష్ణ

ఖమ్మం అర్బన్, మే 10 : ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో శనివారం జెన్టీ ల్యాబ్స్, స్మార్ట్ బ్రెయిన్స్ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 16మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్, కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఏవీవీ శివప్రసాద్, డాక్టర్ జే రవీంద్రబాబు, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, టీపీవో ఎన్.సవిత, కో-ఆర్డినేటర్ జీ ప్రభాకర్ అభినందించారు.

ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సత్కరిస్తున్న మాజీఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లిటౌన్, మే10: మండలంలోని రామానగరం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ సిరిషాని పాపారావు, జయంతి దంపతుల కుమారుడు చరణ్ ఇంటర్‌లో 980/1000, కుమార్తె హర్షిత ఇంటర్ ఫస్టియర్‌లో 438/440 మార్కులు సాధించారు. శనివారం మాజీఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వీరువురిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నత శిఖరాలు అదిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్తుపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, రామానగరం గ్రామశాఖ అధ్యక్షుడు మోటపోతుల నాగేశ్వరరావు, సాలి విజయ్, మాజీ ఎంపీటీసీ నాగబత్తిని చంటి, మోటపోతుల వెంకటేశ్వరరావు, పుల్లారావు, శేషగిరి, కొండ రామకృష్ణ, పిల్లి రమేష్, వాడపల్లి మోహన్‌రావు పాల్గొన్నారు.

'సాయిస్ఫూర్తి'లో సెమినార్

సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్లు

సత్తుపల్లి, మే10: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 2వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్‌పై సెమినార్ నిర్వహించారు. సెమినార్‌లో కీనోట్ స్పీకర్స్‌పై డాక్టర్ తిరువీధుల గోపికృష్ణ, సిటోలిక్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై డాక్టర్ సాదతాహెర్ వివరించారు. వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ సైన్స్‌లో ఇటీవల ధోరణులపై అంతర్జాతీయ సమావేశం, అనేక విభిన్న సమావేశాలు కలిగి సాంకేతికత, నిర్వహణలో తాజా పురోగతులపై దృష్టి సారించిందన్నారు. ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ సైన్స్‌లో ఇటీవల ధోరణులపై అంతర్జాతీయ సమావేశం, అనేక విభిన్న సమావేశాలు కలిగి సాంకేతికత, నిర్వహణలో తాజా పురోగతులపై దృష్టి సారించిందన్నారు. అంతర్జాతీయ సమావేశం 2025 అనేది ఉన్నత స్థాయి పరిశోధన, పరిశ్రమ చొరవలకు సహకరించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఊటూకూరి శేషారత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

సత్తుపల్లి, మే10: కొత్తగూడెం ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో సత్తుపల్లి ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి గల నిరుద్యోగులు ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెంరాజు శనివారం ఒక ప్రటకనలో తెలిపారు. సింగరేణి సంస్థ, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో 8 కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కోర్సుల కాల పరిమితి రెండు నెలలు అని, ఎంచుకున్న కోర్సును బట్టి ఆన్‌జాబ్ ట్రైనింగ్, ఒక్కో కోర్సుకు 30 మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కొత్తగూడెం, సత్తుపల్లి ప్రాంతాలకు చెందిన 18 నుంచి 28 సంవత్సరాల ఉన్న నిరుద్యోగ యువతి, యువకులు తమ దరఖాస్తులను ఈ నెల 31 లోగా కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్ మైనింగ్ ఒకేషనల్ సెంటర్‌లో లేదా కిష్టారం వోసీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 9849411052ను సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా టీఎస్ఆర్‌జేసీ పరీక్ష

ఖమ్మం అర్బన్, మే 10 : జిల్లాలో టీఎస్ఆర్‌జేసీ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 27 సెంటర్స్‌లో పరీక్షను నిర్వహించారు. మొత్తం 6,967 మంది విద్యార్థులకు గానూ 5,859 మంది హాజరయ్యారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరిగింది. ఆరు పరీక్ష కేంద్రాలను డీఈవో సామినేని సత్యనారాయణ తనిఖీ చేశారు.

విదేశీ విద్యపై అవగాహన

ఖమ్మం అర్బన్, మే 10 : ఖమ్మం నగరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో శనివారం విదేశీ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, అడ్మిషన్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, రాజు చెన్న, రవి పాల్గొన్నారు.

మెడికల్ బిల్లులు మంజూరు చేయాలి

ఉపాధ్యాయుల మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లుల స్రూట్నిని ఆలస్యం చేయకుండా వెంటనే మంజూరు చేయాలని టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా మెడికల్ బోర్డు సూపరింటెండెంట్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. అవుట్ పేషెంట్ వారికి కూడా రియంబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. సంఘ నాయకులు విజయ్, వెంగళరావు, కేవీ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం

హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్న భక్తులు

ఖమ్మం, మే 10 : ఖమ్మం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో సుమారు 650 మంది భక్తులతో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం 108 సార్లు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన ఆధ్యాత్మిక అనుబంధ సంస్థ కేసీ దాస్ స్మారక సేవా సంస్థ సనాతనధర్మ వారధి వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి నిర్దేశంలో కార్యక్రమం జరిగింది. విశ్వశాంతి, సనాతనధర్మ పరిరక్షణ, భారతదేశ సర్వసైనిక విజయం కోసం పారాయణం నిర్వహించారు. భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఖమ్మంజిల్లా సత్య సాయి సేవా సంస్థల సహకారంతో అద్భుతంగా నిర్వహించారు. కార్యక్రమంలో సనాతన ధర్మ వారిధి సంస్థ ప్రతినిధులు డాక్టర్ గోటేటి శశి కిరణ్, డాక్టర్ పసుమర్తి శ్రీనివాస్, శివరాజు వెంకట సత్యనారాయణ, కందిబండ రామ మనోహర్‌రావు, కందిబండ ప్రసాద్, ఖమ్మంజిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు దమ్మాలపాటి సుధాకర్, ఖమ్మం సత్యసాయి సంస్థ కన్వీనర్ ఆలస్యం నరసింహారావు, గన్నవరపు ఆదినారాయణ, కోణార్క్ రెస్టారెంట్ అధినేత ప్రతాపని నరసింహారావు, శైలజ దంపతులు, శ్రీ సాయి భజన మండలి అధ్యక్షుడు గన్నవరపు నాగేశ్వరరావు, ఖమ్మం నగర ప్రముఖులు దేవకి వాసుదేవరావు, బోనాల రామకృష్ణ, వేములపల్లి వెంకటేశ్వరరావు, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, ఏసీపీ మహమూద్, ట్రాఫిక్ సీఐలు సాంబశివరావు, శేరి రాము, ప్రముఖ న్యాయవాది రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న తహసీల్దార్ పున్నంచందర్

బోనకల్లు, మే 10: భూభారతి రెవెన్యూ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్ అన్నారు. శనివారం మండలంలోని చిరునోముల, మోటమర్రి గ్రామాల్లో జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి భూ సమస్యల పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో రాచబండి రాంబాబు, ఆర్ఐలు మైథిలి, నవీన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైరా ఎస్సైగా రామారావు

వైరాటౌన్, మే 10: వైరా నూతన ఎస్సైగా రామారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వైరా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు అనంతరం ఎస్సై రామారావు మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీస్ సిబ్బందికి సహకరించాలని అన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు

మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు వీరయ్య

ఎర్రుపాలెం, మే 10: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతులను సమీకరించి ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని తెలంగాణ రైతుసంఘం జిల్లా నాయకుడు దివ్వెల వీరయ్య హెచ్చరించారు. మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో రైతుసంఘం నాయకుడు లగడపాటి అప్పారావు అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో వీరయ్య మాట్లాడారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, కౌలు రైతులకు కూడా ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో అసైన్డ్ భూములు, ఇతర భూములు సాగు చేస్తున్న సన్న, చిన్న కారు రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. నాగార్జునసాగర్ జలాలను మూడవ జోన్ నుంచి రెండవ జోన్‌గా మార్చాలన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న మండల కేంద్రంలో మండలస్థాయి రైతు సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామ కమిటీను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కొండేపాటి శివయ్య, లగడపాటి అప్పారావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్‌రావు, కేవీపీఎస్ మండల కార్యదర్శి సగ్గర్తి సంజీవరావు, కొండేపాటి గురవయ్య, చిన్న నర్సింహారావు, రమేశ్, దుర్గారావు, శ్రీను, నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

లచ్చగూడెంలో బడిబాట

బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మధిర(చింతకాని), మే 10: చింతకాని మండలం లచ్చగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ పాఠశాలలో 2025 పదోతరగతి పరీక్షల్లో 95 శాతం ఉత్తీర్ణత సాధించిన విషయాన్ని, పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను గురించి ప్రజలకు వివరించారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస్, సీతారాంరెడ్డి, నూర్జహాన్‌బేగం, సునీత, పీఈటీ వెంకటేశ్వర్లు , విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేయూ ఎన్ఎస్ఎస్ కమిటీ మెంబర్‌గా రమణారావు

ఖమ్మం అర్బన్, మే 10 :కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కమిటీ మెంబర్‌గా కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమణారావు నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ వీసీ ప్రతాపరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. చైర్మన్ ఎం.నిరంజన్‌రెడ్డి, కరస్పాండెంట్ అప్పిరెడ్డి తదితరులు ప్రిన్సిపాల్‌ని అభినందించారు.

లైంగిక వేధింపుల నివారణపై శిక్షణ

కొత్తగూడెం సింగరేణి, మే 10: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై సంబంధిత అధికారులకు, ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని జీఎం రఘుపతి శనివారం ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. హిందూస్తాన్ అకాడమీ ఆఫ్ లా (విశాఖపట్నం) ప్రొఫెసర్ పార్వతీశం శిక్షణ ఇచ్చారు.

20న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

దమ్మపేట, మే 10: కార్మిక హక్కులను హరిస్తున్న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 20న సార్వత్రిక సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కోరారు. సమ్మెను జయప్రదం చేయాలని దమ్మపేటలో శనివారం ప్రచారం నిర్వహించారు. నాయకులు కొప్పుల శ్రీను, సూరి, పోలరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులకు కృతజ్ఞతలు

పెనుబల్లి, మే10: తల్లాడ మండలం మిట్టపల్లిలో శుక్రవారం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనను విజయవంతం చేసిన కార్యకర్తలు, నాయకులకు మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల రాష్ట్ర, దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వరంగల్ బహిరంగ సభ విశ్రాంతి తీసుకోకుండానే మళ్లీ ఖమ్మం జిల్లా పర్యటనలో కేటీఆర్ పాల్గొనడం చాలా గొప్ప విషయమన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కీర్తిశేషులు రాయల శేషగిరి విగ్రహాన్ని ఆవిష్కరించి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని నింపారన్నారు.

ఆరు సెల్‌ఫోన్లు రికవరీ

బాధితులకు ఫోన్‌లు అందిస్తున్న సీఐ మురళి

ముదిగొండ, మే 10: పోగొట్టుకున్న ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు సీఐఈఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి ఆరు ఫోన్లను రికవరీ చేశారు. రికవరీ చేసిన ఫోన్లను శనివారం సీఐ మురళీ బాధితులకు అందజేశారు. సెల్‌ఫోన్ పోయినట్లయితే మీసేవా ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే వాటిని రికవరీ బాధితులకు చేస్తామని సీఐ తెలిపారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

తల్లాడ, మే10: హైదరాబాద్‌లోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన ఐలూరి భావన(22) హాస్టల్‌లో శనివారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

చైన్ స్నాచింగ్

కూసుమంచి, మే 10: ఇంటి ముందు ఉన్న మహిళ నుంచి అడ్రస్ అడిగి ఆమె మెడలోని సుమారు నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లిన ఘటన మండలంలోని కేశ్వాపురంలో శనివారం చోటు చేసుకున్నది. మండలంలోని కేశ్వాపురం గ్రామానికి చెందిన బెల్లం సావిత్రమ్మ ఇంటి ముందు నిలబడి ఉండగా పల్సర్ బండిపై సుమారు 30 సంవత్సరాల లోపు ఉన్న ఇద్దరు వ్యక్తులు ఫలానా వారి ఇల్లు ఎక్కడా అని అడిగి మాటలు కలిపి ఒక్కసారిగా మెడలోని గొలుసును లాక్కొని ఖమ్మం వైపునకు వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూసుమంచి, మే 10: మండలలోని బండమీదతండాలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరని టాటాఏసీ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకున్నది. బండమీదతండాకు చెందిన బదావత్ లింగా, బదావత్ మాన్సింగ్ ఇద్దరు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏసీ ఢీకొట్టడంతో గాయాలయ్యాయి.

ఇసుక ట్రాక్టర్ ట్రక్ బోల్తా

ముదిగొండ, మే 10: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ట్రక్ బోల్తా పడిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దమండవకు చెందిన వ్యక్తి ఏపీలోని మల్కాపురంనుంచి ఖమ్మానికి ఇసుక తరలిస్తుండగా చిరుమర్రి - పమ్మి మధ్య సాగర్ కాలువ వద్దకు చేరుకోగానే అదుపు తప్పి ట్రాక్టర్ ట్రక్ బోల్తా పడింది. అప్రమత్తమైన డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఎలమంచమ్మకు నివాళి

ఎలమంచమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం, మే 10: మండలంలోని రఘునాధపాలెం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు గౌని మల్లయ్య మాతృమూర్తి ఎలమంచమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి శనివారం రఘునాధపాలెం వెళ్లి మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతితెలిపారు. నివాళి అర్పించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, నాయకులు ఆర్మిరవి, బోడ మంచానాయక్, షేక్ చందు, కీసరం సంకీర్త్‌రెడ్డి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
FINANCIAL SERVICES
★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491- All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616